ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 5
సంపుటి : 3
సంచిక : 40

సోమవారం 8 జూలై 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



## వైభవంగా గోల్కొండ బోనాలు..

శ్రీ జగదాంబిక ఆలయంలో ఉత్సవాలు షురూ..

పట్టు వస్త్రాలు సమర్పించిన స్పీకర్, మంత్రులు

భాగ్యనగరంలో ప్రతి ఏటా ఆషాఢ మాసంలో నెలరోజుల పాటు జరిగే బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదమంత్రాలు, ఊరేగింపులు, శివసత్తులు, పోతరాజుల నృత్యాలతో ఆదివారం చారిత్రక గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారి ఆలయంలో బోనాల వేడుకలకు శ్రీకారం చుట్టారు.

నార్సింగ్, జూలై 7 : ఈ వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు గవర్నర్ సి.వి.రాధాకృష్ణన్ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు టి.ప్రకాషగౌడ్, దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల

మిగతా 2 లో



## ఫార్మా సిటీగా హైదరాబాద్..

ఫార్మా యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా ప్రధానితో మాట్లాడతా

ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 7 : వ్యాక్సిన్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్‌ను ప్రపంచ ఫార్మా సిటీగా మార్చేందుకు ఔషధ తయారీ సంస్థలకు అన్ని రకాల సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ఫార్మా పరిశ్రమ మద్దతు చాలా అవసరమన్న విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఫార్మా యూనివర్సిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా ప్రధాని మోదీతో మాట్లాడతానని చెప్పారు. హైటెక్స్‌లో

మిగతా 2 లో

# అసంపూర్తి ప్రాజెక్టులపై సీఎం దృష్టి

## తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు..

రూ.241 కోట్ల ఖర్చుతో 48 వేల ఎకరాలకు నీరు

త్వరితగతిన పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి సంకల్పం

తొలుత గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం ఆదేశం

వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యం



రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ సంకల్పించారు. వాటిని పూర్తి చేస్తే తక్కువ ఖర్చుతోనే ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు.. ఇప్పటికే నిధులు ఖర్చు చేసినవి, అసంపూర్తిగా ఉన్నవి, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన సాగు ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

హైదరాబాద్, జూలై 7 : ముఖ్యంగా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా.. గోదావరి, కృష్ణా బేసిన్‌లలో నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీర్లతో మాట్లాడి

మిగతా 2 లో

## ఈ ప్రభుత్వం అందరిదీ.. సర్వమతాలకు స్వేచ్ఛ కల్పిస్తాం..

ఇస్కాన్ 'పూరిజగన్నాథ రథయాత్ర'లో సీఎం రేవంత్‌రెడ్డి



కవాడిగూడ, జూలై 7 : "ఈ ప్రభుత్వం అందరిదీ. సర్వమతాలకు స్వేచ్ఛ, అవకాశాలను కల్పిస్తుంది. మత సామరస్యాన్ని పాటిస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పూరి జగన్నాథ రథయాత్రను ఆయన ప్రారంభించారు. ఆబిడ్స్ ఇస్కాన్ దేవాలయం

## అవినీతిపరులను మోదీ సర్కారు ఉపేక్షించదు

ఈడీ, సీబీఐ కేసులున్న నేతలను చేర్చుకోం..

పార్టీ అధ్యక్ష మార్పు హైకమాండ్ పరిధిలో: సంజయ్



కరీంనగర్, జూలై 7 : ఈడీ, సీబీఐ కేసులున్న నాయకులను బీజేపీలోకి తీసుకునే అవకాశం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈడీ, సీబీఐ సంస్థల విచారణకు బీజేపీకి సంబంధం లేదని, నరేంద్ర మోదీ సర్కారు అవినీతిపరులను ఉపేక్షించే ప్రసక్తే


# తెలంగాణ టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

తెలుగు రాష్ట్రాల అభివృద్ధే అభిమతం

సమస్యల పరిష్కారం దిశగా ముదుకెళ్తాం

ఏపీ సీఎం నారాచంద్ర బాబు నాయుడు


ఏపీలో టీడీపీతో కూడిన ఎన్డీఏ కూటమి బంపర్ విక్టరీ సాధించడంతో ఆ ప్రభావం తెలంగాణలోనూ కనిపిస్తోంది. సీఎం రేవంత్‌తో భేటీకోసం హైదరాబాద్‌కు వచ్చిన చంద్రబాబు.. టీడీపీ శ్రేణులు చెప్పిన గ్రాండ్ వెలకమ్ చూస్తే.. రాష్ట్రంలో కొన్నేళ్లుగా నిస్తేజంగా మారిన టీడీపీ క్యాడర్‌లో.. కాస్త జోష్ వచ్చినట్టు తెలుస్తోంది.



హైదరాబాద్: ఇక, తాజాగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వచ్చినప్పుడు కూడా.. అధినేతకు అదేస్థాయిలో స్వాగతం పలికింది క్యాడర్. చాలారోజుల తర్వాత తెలంగాణ టీడీపీ నేతలను, కార్యకర్తలను కలిసిన చంద్రబాబు.. రాష్ట్రంలో పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పుట్టిన టీడీపీని.. మళ్లీ పునర్నిర్మిద్దామంటూ

మిగతా 2 లో

## నేడు, రేపు భారీ వర్షాలు..



రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రెండ్రోజులు ఖమ్మం, జనగామ, సూర్యాపేట, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

హైదరాబాద్, జూలై 7 :శనివారం దక్షిణ ఏపీ తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న ఆవర్తనం ఆదివారం అదే ప్రాంతంలో సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఇక గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లా తాంసీ మండలంలో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది.

## గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది!

గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన వారు

ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థులు


ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల వెల్లడి..

అక్టోబరు 21 నుంచి 27 దాకా మెయిన్స్

మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు



.. వివరాలు 2లో



## సోషల్ మీడియా ముసుగులో క్రూర మృగాలు

తల్లిదండ్రులూ.. జాగ్రత్త!

సోషల్ మీడియాలో పిల్లల ఫొటోలు పోస్టు చేయొద్దు

ఓ యూట్యూబర్ వ్యాఖ్యలపై తెలంగాణ, ఏపీ సీఎంలకు హీరో సాయి దుర్గా తేజ్ ఫిర్యాదు

సోషల్ మీడియాలో చిన్న పిల్లలపై అసభ్యకరమైన రీతిలో ట్రోల్స్ జరుగుతున్న నేపథ్యంలో హీరో సాయి దుర్గాతేజ్ స్పందించారు. 'పేరెంట్స్ అందరికీ నా విన్నపం ఇదే. పేరెంట్స్ అందరూ తమ పిల్లల



మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 8 జూలై 2024




# వైభవంగా గోల్కొండ బోనాలు..





**మొదటి పేజీ తరువాయి**

విజయలక్ష్మి, మాజీ ఎంపీ హనుమంతురావు, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, ఆలయ కమిటీ సభ్యులతోపాటు పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.
అంతకుముందు చోటాబజార్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ పూజారి అనంతచారి సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. లంగరహౌజ్ నుంచి భారీ అడుగుల తొట్టెల ఊరేగింపు, చోటాబజార్ నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గోల్కొండ కోటపై గల శ్రీ జగదాంభిక (గోల్కొండ ఎల్లమ్మ) అమ్మవారి ఆలయం వరకు ఊరేగించారు. మరోపక్క బంజారా దర్వాజ నుంచి పటేల్ లక్ష్మమ్మ ఇంటి నుంచి మొట్ట మొదటి బోనం దేవాలయం వరకు ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. కుతుబ్‌షాహీ కాలం నుంచి చోటాబజార్‌లోని ఆలయ పూజారి అనంతచారి ఇంటి నుంచి ఉత్సవ విగ్రహం, బంజారాదర్వాజ పటేల్ లక్ష్మమ్మ ఇంటి నుంచి మొదటి బోనం సమర్పించండం ఆనవాయితీగా వస్తోంది. ఇక ప్రతి ఆదివారం, గురువారం గోల్కొండ కోటలో ఆగస్టు 4 వరకు బోనాల ఉత్సవాలు జరుగుతాయి. గోల్కొండలోని గల శ్రీజగదాంబిక అమ్మవారి దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే రెండు లక్షలకు పైగా భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది.

**ఘనంగా కుమ్మర్ల బోనాల జాతర**

బోనాల పండుగ సందర్భంగా మట్టికుండల్లోనే బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించేలా త్వరలోనే జీవో తీసుకొచ్చి అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌లు హామీ ఇచ్చారు. ఆషాఢ మాసం బోనాల పండగ సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జగదీష్ మందిర్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వరకు కుమ్మర్ల బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# తెలంగాణ టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

**మొదటి పేజీ తరువాయి**

పిలుపునిచ్చారు. నాయకులు వెళ్లిపోయినా.. కార్యకర్తలు మాత్రం పార్టీతోనే ఉన్నారన్నారు చంద్రబాబు. తనకు రెండు తెలుగు రాష్ట్రాలూ రెండు కళ్లలాంటివన్నారు చంద్రబాబు. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమన్నారు. ఆ ఉద్దేశ్యంతోనే తెలంగాణ సీఎంతో చర్చలు ప్రారంభించామన్న చంద్రబాబు.. వాటిని సమస్యల పరిష్కారం దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తానన్నారు. 2019 ఎన్నికల్లో ఏపీలో అధికారం కోల్పోవడం, తర్వాత అరెస్టు వంటి పరిణామాలతో చంద్రబాబు..తెలంగాణ టీడీపీ గురించి ఆలోచించలేకపోయారు. దీంతో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోటీకి దిగలేదు..తెలుగుదేశం పార్టీ. అయితే ఇప్పుడు ఏపీలో అధికారంలోకి రావడం, కేంద్రంలో కూడా శాసించే పరిస్థితుల్లో ఉండడంతో..తెలంగాణలో పార్టీని రీస్టార్ట్ చేసే యోచన చేస్తున్నారు చంద్రబాబు. ఓ వైపు వరుస ఓటములు, నేతల వలసలతో బీఆర్ఎస్ బలహీనపడుతుండడం మరోవైపు టీడీపీ మళ్లీ యాక్టివ్ అయ్యే ప్రయత్నం చేస్తుండడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

# అసంపూర్తి ప్రాజెక్టులపై సీఎం దృష్టి

**మొదటి పేజీ తరువాయి**

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయకట్టు భూములకు సాగునీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఇప్పటికే పలు దఫాలుగా ఈ ప్రాజెక్టులపై అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులు, వీలైనంత త్వరగా సాగునీటిని అందించేందుకు వీలున్న ప్రాజెక్టులను చేపడితే రైతులకు మేలు జరుగుతుందని, అందుకు అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఇందులో భాగంగా గోదావరి బేసిన్ పరిధిలోని నీల్వాయి వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెంవాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజ్-2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని నిర్ణయించారు.
ఈ ప్రాజెక్టుల పనుల పూర్తికి దాదాపు రూ.241 కోట్ల మేర నిధులు ఖర్చవుతాయని, తద్వారా దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. 2025 మార్చి నాటికి పనులు పూర్తయ్యేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళిక ప్రకారం ముందుకువెళ్లాలని అధికారులకు సీఎం సూచించారు. నీల్వాయి వాగు ద్వారా మంచిర్యాల జిల్లాలోని భూములకు సాగునీరు అందనుండగా, పింప్రి ఎత్తిపోతల పథకం, సదర్మట్ ప్రాజెక్టు ద్వారా నిర్మల్ జిల్లాకు, పాలెంవాగుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజి-2తో వరంగల్, మహబూబాబాద్, జనగామ, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల రైతులకు సాగునీరు అందనుంది.
కాగా, గత ప్రభుత్వం పదేళ్లలో చేపట్టిన ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్‌హౌసలకే పరిమితమయ్యాయని సీఎం అభిప్రాయపడినట్టు తెలిసింది. భారీగా అప్పులు తెచ్చి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించినా.. నీరు పారేందుకు అవసరమైన ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టుకు నీటిని అందించే కాలువలు నిర్మించలేదనే అంశంపైనా చర్చించినట్టు సమాచారం.

**ఈ ప్రభుత్వం అందరిదీ.. సర్వమతాలకు స్వేచ్ఛ కల్పిస్తాం..**

ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రథయాత్రకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందిరాపార్కు వద్ద రథయాత్రలో కొలువుదీరిన జగన్నాథుడికి సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుఖశాంతులతో వర్ధిల్లాలని, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని భగవంతుణ్ని కోరుకున్నట్లు రేవంత్ తెలిపారు. రాష్ట్రంలో హింస, డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనికి ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆబిడ్స్ ఇస్కాన్ దేవాలయానికి సేవలు చేస్తున్న వారికి ప్రసాదం, అవార్డులను అందజేశారు.

# మాయలాడి.. కిలాడీ లేడీ

**ఈజీగా భర్తలను మార్చేస్తోంది**

**50మందితో తాళికట్టించుకున్న మహిళ**

**అవక్కయిన తమిళనాడు పోలీసులు**

చెన్నై: పెళ్లంటే నూరేళ్ల పంట.. మ్యారేజెస్ మేడిన్ హెవన్ అంటారు. ఒక్కసారి మూడు ముళ్లు పడితే జీవితాంతం ఒకరి కోసం ఒకరు బతకడమే పెళ్లంటే.. కానీ ఈమెకు మాత్రం మ్యారేజెస్ అంటే మూడునాళ్ల ముచ్చటే. తలంబ్రాలు పోయించుకున్నామా.. డబ్బు, నగలతో ఉడాయించామా అన్నట్టుగా సాగిస్తోందీ కిలాడీ లేడీ. వాట్సాప్‌లో డీపీ మార్చినంత ఈజీగా.. డ్రస్ మార్చేసినంత సులభంగా భర్తలను మార్చేస్తూ ఎందరో జీవితాలతో ఆడుకుంది ఈ మాయలేడి.. రెండో పెళ్లి చేసుకుంటేనే దొరికిపోతున్న ఈ రోజుల్లో నలభై పెళ్లిళ్లు ఒకరికి తెలియకుండా మరొకరిని చేసుకోవడం సాధ్యమా? అంటే సాధ్యమేనంటుంది ఈ నిత్య పెళ్లకూతురు. ఏకంగా నలభై మందిని పెళ్లి చేసుకుని చివరకు పోలీసుల చేతికి చిక్కింది. ఈ దారుణం తమినాడులో జరిగింది. తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన ఓ యువకుడికి 35 సంవత్సరాలు వచ్చినా పెళ్లి కాకపోవడంతో డేట్ ద తమిళ్ వే అనే వెబ్‌సైట్‌లో సంధ్య అనే మహిళతో పరిచయం ఏర్పడింది. వాళ్లిద్దరు ఇష్టపడ్డారు. లగ్నకోటి రాసుకొని మరీ దండలు మార్చుకున్నారు. లగ్గమైంది. కాపురం పెట్టారు. అంతా సాఫీగా సాగుతోందనే టైమ్‌లో ఒక్కసారిగా కిరికిరి. పెళ్లయిన మూడు నెలలు కూడా కాకుండానే ఆమె ప్రవర్తనలో ఏదో తేడా వచ్చింది. అనుమానం వచ్చిన ఆ యువకుడు.. సంధ్య ఆధార్ కార్డు చెక్ చేయగా అందులో భర్త పేరు వేరే ఉంది. ఇదేంటని ప్రశ్నిస్తే చంపేస్తానంటూ భర్తను బెదిరించింది. దీంతో ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. సంధ్యను అదుపులో తీసుకుని విచారిస్తే అసలు యవ్వారం బయటపడింది. ఆమెకు 50 కంటే ఎక్కువ మందితో పెళ్లైందని విచారణలో తేలింది. ఒక డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, మదురైలో మరో పోలీసు అధికారి, ఒక ఫైనాన్స్ అధికారితో సహా 50 మందికి పైగా ఆమె బాధితుల లిస్ట్‌లో ఉన్నారని తేలింది. సంధ్య ఇప్పటివరకు 39 పెళ్లిళ్లు చేసుకున్నట్లు విచారణలో బయటపడిందని పోలీసులు తెలిపారు. అయితే.. సంధ్య విషయం తెలిసి.. పోలీసులే అవాక్కవుతున్నారు. మొత్తం మీద ఇంత మందిని మోసం చేసిన ఈ మహిళను ప్రస్తుతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# వరద నీటిలో చిక్కుకున్న టూరిస్టులు

## రంగంలోకి దిగిన రెస్క్యూ టీం



గోవా: గోవాలో పాలి వాటర్ ఫాల్ కి వెళ్లిన సందర్శకులు వరద నీటిలో చిక్కుకున్నారు. జలపాతం చూసేందుకు వెళ్లిన టూరిస్టులకు ఊహించని పరిణామం ఎదురైంది. భారీ వర్షాల కారణంగా సమీపంలోని నది నీటి మట్టం ఒక్కసారిగా పెరిగింది. దీంతో దాదాపు 80 మంది వరదలోనే చిక్కుకుపోయారు. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని బాధితులను కాపాడేందుకు చర్యలను ముమ్మరం చేసాయి. ఫస్ట్ టైం 50 మందిని రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరో 30 మందిని కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు అధికారులు. చిక్కుకున్నవారిని రక్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అక్షత్ కౌశల్ తెలిపారు. వీకెండ్ కావడంతో గోవాలోని సత్తారి తాలూకాలోని పాలి జలపాతానికి భారీ సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. జలపాతానికి చేరుకునే ముందు నది దాటుకునే వెళ్లారు. తర్వాత భారీ వర్షం రావడంతో నది నీటి మట్టం ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో 80 మంది పర్యాటకులు వరద చిక్కుకున్నారు. పిఐ వాల్పోయి నేతృత్వంలోని నార్త్ గోవా పోలీసు బృందం అగ్నిమాపక శాఖతో కలిసి సహాయక చర్యలు చేపట్టి కాపాడారు. ఇక గోవా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే కురిసిన భారీ వర్షానికి గోవా ఎయిర్ పోర్టులో భారీగా వరద నీరు చేరింది. వరద నీటిని తొలగించేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. దీంతో జలపాతాల వద్దకు పర్యాటకులు ఎవరూ కూడా వెళ్లొద్దని హెచ్చరించింది. ప్రభుత్వ అధికారులు సైతం సరైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

# ఛార్‌ధామ్ యాత్రకు బ్రేక్

**భారీ వర్షాలతో**

**కొండచరియలు పడే అవకాశం**

**ఉగ్రరూపం దాల్చిన అలకానంద**

ఉత్తరాఖండ్: భారీవర్షాల కారణంగా ఛార్‌ధామ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఛార్‌ధామ్ యాత్రను నిలిపివేస్తునట్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని డెహ్రాడూన్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బద్రీనాథ్ , కేదార్‌రాథ్ , యమునోత్రి మార్గాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని హెచ్చరికలు రావడంతో యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. ఛార్‌ధామ్ యాత్రికులు తమ ప్రయాణాలను మానుకోవాలని అధికారులు సూచించారు. ఇప్పటికే బద్రీనాథ్ హైవేను మూసేశారు. కొండచరియలు విరిగిపడడంతో మూసేశారు. చాలా చోట్ల రోడ్లకు గుంతలు ఏర్పడ్డాయి. జోషిమఠ్ లోని విష్ణుప్రయాగ్ దగ్గర అలకానంద ఉగ్రరూపాన్ని దాల్చింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీవర్షాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. ఉత్తరాఖండ్ లోని తొమ్మిది జిల్లాలకు వాతావరణశాఖ రెడ్అలర్ట్ జారీ చేసింది. గర్వాల్ ప్రాంతంలో రెండు రోజుల పాటు అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. రాంనగర్‌లో చాలా వంతెనలు ధ్వంసమయ్యాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి సూచించారు. వాతావరణం అనుకూలించిన తరువాతే ఛార్‌ధామ్ యాత్ర తిరిగి ప్రారంభమవుతుందని అధికారులు వెల్లడించారు. ప్రతి ఏటా లక్షలాదిమంది భక్తులు ఛార్‌ధామ్ యాత్రకు వస్తుంటారు. ఈసారి కూడా ఇప్పటికే చాలామంది దివ్యక్షేత్రాలను సందర్శించుకున్నారు.

# అవినీతిపరులను మోదీ సర్కారు ఉపేక్షించదు

**మొదటి పేజీ తరువాయి**



లేదని చెప్పారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లోలాగా రాజీనామా చేయకుండా బీజేపీలోకి వచ్చే అవకాశాలు లేవన్నారు. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన కాంగ్రెస్ ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని ఎందుకు రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు. 'విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల సీఎంలు సఖ్యతతో ఉన్నారు. ఇది మంచి పరిణామం. గతంలో కేసీఆర్ ప్రభుత్వం విభజన అంశాలకు పరిష్కారం లభించే అవకాశాలున్నా రాజకీయ లబ్ధి కోసం సమస్యలను జఠిలం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే విభజన సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించారు. బీజేపీ అధ్యక్ష మార్పు, కొత్త అధ్యక్షుడి ఎంపిక అంశం పూర్తిగా పార్టీ హైకమాండ్ పరిధిలో ఉంటుందని సంజయ్ స్పష్టం చేశారు. 'రామాయణ్ సర్క్యూట్ కింద ఇల్లందకుంట, కొండగట్టు ఆలయాలను అభివృద్ధి చేసే అవకాశముంది. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతాం. ప్రతిపాదనలు పంపించాలని గత ప్రభుత్వాన్ని అనేకసార్లు కోరినా కేసీఆర్ మూర[illegible]ంగా వ్యవహరించారు. కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే జరిగింది. రైల్వే లైన్ పూర్తయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది' అని చెప్పారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకే కేంద్రం స్మార్ట్ సిటీ గడువు పొడిగించిందని.. సీఎం రేవంత్ అడిగారని మాత్రం కాదని వివరించారు.

# ఫార్మా సిటీగా హైదరాబాద్ ..

**మొదటి పేజీ తరువాయి**

ఆదివారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ 73వ సదస్సు ముగింపు కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2027 నాటికి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా చేయాలన్న సంకల్పంతో ప్రధాని ఉన్నారన్నారు.
ఇందులో భాగంగా మౌలిక సదుపాయాల కోసం నిధులు వెచ్చిస్తున్నామని చెప్పారు. దేశంలో వైద్య కళాశాలలను గణనీయంగా పెంచామన్నారు. 2014లో 388 వైద్య కళాశాలలు ఉండగా, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్లలో వాటి సంఖ్య 706కు చేరిందన్నారు. ఎంబీబీఎస్ సీట్లు 51,348 నుంచి 1.09 లక్షలకు చేరాయన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్రం 12 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వైద్య బీమా అందిస్తోందన్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా జనరిక్ మెడిసిన్‌ను అందుబాటులోకి తెచ్చామని, తద్వారా 50 నుంచి 90%తక్కువ ధరకే మందులు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. కాగా, రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

# గ్రూప్-1 మెయిన్స్‌కు 31,382 మంది!

హైదరాబాద్, జూలై 7 : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ప్రిలిమ్స్‌లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా 31,382 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేసినట్లు కమిషన్ అధికారులు వెల్లడించారు. ఫలితాలను ఆదివారం కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచారు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 19న నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుల భర్తీలో భాగంగా జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. జూన్ 24న ప్రాథమిక కీని విడుదల చేశారు. దానిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, ఆదివారం తుది కీని ప్రకటించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే ఫలితాలను కూడా వెల్లడించారు. ప్రిలిమినరీ పరీక్షలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.
ఈ నిష్పత్తి ప్రకారం మెయిన్స్‌కు 28,150 మంది ఎంపిక కావాల్సి ఉంది. అయితే.. 1:50 నిష్పత్తిలో కొన్ని ప్రత్యేక రిజర్వేషన్ కేటగిరీల్లోని పోస్టులకు అభ్యర్థులు అందుబాటులో లేకపోతే మెరిట్ జాబితాలోని ఇతర అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. రిజర్వేషన్ పోస్టుల భర్తీ కోసం కటాఫ్ మార్కుల కంటే దిగువ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీనివల్ల పోస్టుల సంఖ్య, ఎంపికైన అభ్యర్థుల నిష్పత్తిలో కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రిలిమినరీ పరీక్ష కటాఫ్ మార్కుల జాబితాను పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత వెల్లడించనున్నట్లు కమిషన్ అధికారులు ప్రకటించారు.

**మూడు సార్లు..!**

గ్రూప్-1 పోస్టుల భర్తీ విషయంలో అనేక సంవత్సరాలుగా వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలను రెండు సార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. మొదటిసారి ప్రశ్నపత్రం లీక్ కావడంతో రద్దు చేశారు. రెండోసారి పరీక్ష నిర్వహణలో నిబంధనలను పాటించలేదన్న కారణంగా కోర్టు రద్దు చేసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి, ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. అంటే.. గ్రూపు-1 పోస్టుల కోసం అభ్యర్థులు మూడుసార్లు ప్రిలిమినరీ పరీక్షలను రాశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు లోపు గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని భావిస్తోంది. కాగా, గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అక్టోబరులో జరిగే మెయిన్స్ పరీక్షలోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇక ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించలేని వారు నిరుత్సాహపడొద్దని సీఎం తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

**గ్రూపు-2 పరీక్షలు వాయిదా?**

ఇక గ్రూపు-2 పరీక్షలను వాయిదా వేసే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం జులై 17 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పరీక్షలు పూర్తయిన వెంటనే.. ఆగస్టు 7, 8వ తేదీల్లో గ్రూపు-2 పరీక్షలు ఉన్నాయి. చాలా మంది అభ్యర్థులు ఈ రెండు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దీంతో గ్రూపు-2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# సోషల్ మీడియా ముసుగులో క్రూర మృగాలు

**మొదటి పేజీ తరువాయి**

ఫొటోలు సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్త వహించండి. బయట సోషల్ మీడియా ముసుగులో చాలా క్రూరమైన మృగాలు ఉన్నాయి. వారు మీ పిల్లల ఫొటోలపై ఇష్టమొచ్చినట్లు కామెంట్స్ చేస్తారు.. మార్ఫింగ్ చేస్తారు. పేరెంట్స్ ఆ వ్యక్తులు చేసే కామెంట్స్ వల్ల ఎంత ఇబ్బందిని అనుభవిస్తారో, ఎంత మానసిక ఒత్తిడికి లోనవుతారో వారికి అర్థం కాదు' అని పేర్కొన్నారు.
'ఎక్స్' వేదికగా చేసిన ఈ పోస్ట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేశారు. ఈ పోస్ట్ పెట్టిన వెంటనే సాయి దుర్గాతేజ్ మరో ట్వీట్‌లో ఓ వీడియోను షేర్ చేసి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆయన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను, పోలీసులను కోరారు. ఇందులో ప్రణీత్ హనుమంతు అనే ఓ యూట్యూబర్.. కొంతమంది యూట్యూబర్లతో కలిసి ఓ తండ్రి, తన చిన్నారి కూతురు వీడియోను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడారు.

**స్పందించిన రేవంత్, భట్టి విక్రమార్క, మంచు మనోజ్**

ఈ పోస్ట్‌పై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క.. సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. టాలీవుడ్ హీరో మంచు మనోజ్ కూడా ఈ పోస్ట్‌పై స్పందించారు. 'ఇలాంటి వ్యక్తుల ప్రవర్తన సహించరానిదని.. వీరిని ఊరికే వదిలిపెట్టకూడద'ని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఆషాడ మాసం తొలి బోనం సమర్పణ...

## మట్టి కుండలోనే బోనం సమర్పించాలి : మున్సిపల్ చైర్మన్



భువనగిరి,జూలై7(రోమింగ్ న్యూస్) : ఆషాడ మాసం ప్రారంభం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గ్రామదేవతలకు ఆదివారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించారు. ఆజాద్ రోడ్, హనుమాన్ వాడ, బాహర్ పెట్ లోని పోచమ్మ తల్లి, పోచమ్మ వాడ లోని నల్ల పోచమ్మ తల్లి, గాంధీ నగర్ లోని మైసమ్మ, నల్ల పోచమ్మ, కిసాన్ నగర్ లోని పెద్దమ్మ దేవతలకు ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి బోనం సమర్పించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొని అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడుతూ ఆషాడ మాసం ప్రారంభ సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలోనే తొలి బోనం సమర్పించే ఆనవాయితీ ఉందని ఇందులో భాగంగానే ఆదివారం బోనం సమర్పించడం జరిగిందన్నారు. గ్రామ దేవతలు భువనగిరి ప్రజలను ఆయురారోగ్యాలతో ఉంచాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్ లు మాయ దశరథ, రత్నపురం బలరాం, వడిచెర్ల లక్ష్మీకృష్ణ, కైరం కొండ వెంకటేష్, పచ్చల హేమలత జగన్మోహన్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు తాడూరి అంజయ్య, మేస్త్రి కార్యదర్శి తాడూరి బాల్ శంకర్, కోశాధికారి తాడూరి కుమార్, గౌరవాధ్యక్షులు తాడూరి కిష్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవం...



భువనగిరి,జూలై7(రోమింగ్ న్యూస్) : ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు, మందకృష్ణ మాదిగ 60 వ జన్మదినోత్సవ వేడుకలు స్థానిక హైదరాబాద్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ మాదిగ జాతి ఆత్మగౌరవ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, సీనియర్ నాయకులు బండారు రవివర్ధన్ మాదిగ, సందేల శ్రీనివాస్ మాదిగ, సిర్పంగా సుభాష్ మాదిగ, కోళ్ల జహంగీర్ మాదిగ, ఎర్ర మహేష్ మాదిగ, కొల్లూరి హరీష్ మాదిగ, ఆకారపు లక్ష్మి నారాయణ మాదిగ, కుశంగాల కుమార్ మాదిగ, కానుకుంట్ల కొటేష్ మాదిగ, బండారు శివశంకర్ మాదిగ, దర్గాయి దేవేందర్ మాదిగ, ఒద్దిగాళ్ల రాజు మాదిగ, బూడిద సింహాద్రి మాదిగ, గందమల్ల మనోజ్ కుమార్, మాదిగ సల్ల యాదగిరి మాదిగ, మంద వెంకటేష్ మాదిగ, మూడంపల్లి శివ మాదిగ, గూడెంకి లక్ష్మి నర్సయ్య, వంకరి శ్రీకాంత్, కోళ్ల శివ గణేష్ మాదిగ లు పాల్గొన్నారు.

# నమాత్ పల్లి టు తుక్కాపూర్ బీటీ రోడ్డు వెయ్యాలి : సిపిఎం



భువనగిరి,జూలై7(రోమింగ్ న్యూస్) : మండలంలోని నమాత్ పల్లి టు తుక్కాపూర్ రోడ్డు బీటీ రోడ్డు వెయ్యాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మండల కార్యదర్శిలు మాటూరు బాలరాజు గౌడ్, దయ్యాల నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నమాత్ పల్లి గ్రామంలో సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు ప్రభుత్వం వెంటనే గ్రామంలో ధ్వంసమైన ఎస్సీ కాలనీలో అంతర్గత సిసి రోడ్లు నిర్మించాలన్నారు. గ్రామంలో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్సీ కాలనీ అంతర్గత సిసి రోడ్లు పూర్తిగా గుంతల మయమై ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై జరగబోయే తాసిల్దార్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని కార్యకర్తలను ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి ఎల్లంల వెంకటేశం, మండల కమిటీ సభ్యులు జిట్టా అంజిరెడ్డి, వికలాంగుల సంఘం జిల్లా నాయకులు సుప్పంగ ప్రకాష్, సిపిఎం నాయకులు బత్తిని దానయ్య గౌడ్, ఐతరాజు కిష్టయ్య, బీనబోయిన ముత్యం ప్రకాష్ గ్రామ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# సిలిండర్ల లారీ బోల్తా

శ్రీశైలం ,జూలై 6 ( రోమింగ్ న్యూస్ ) నంద్యాల జిల్లా శ్రీశైలం దోర్నాల, ఆత్మకూరు నల్లమల రోడ్డులో రోళ్లపెంట టర్నింగ్ వద్ద ఏపీ 21 టి యు 2799 గల సిలిండర్ లారీ బోల్తా పడింది. ఎలాంటి ప్రాణాపాయం లేదు. ఈ లారీ ఎలా బోల్తా పడిందో పోలీసు ఎంక్వయిరీలో తెలియాల్సి ఉంది.



# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

## జనగామలో పురుగుల మందు తాగిన భార్యాభర్తలు

## భర్త మృతి, ప్రాణాపాయ స్థితిలో భార్య







జనగామ, జులై 7: (రోమింగ్ న్యూస్) రాష్ట్రంలో వర్షాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో రైతులు బాధపడుతున్న ప్రస్తుత తరుణంలో జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో ఆదివారం అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకోవడం తో రైతుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆర్థిక సమస్యలతో అప్పుల బాధతో తరచూ గొడవలు పడుతున్న రైతు భార్యాభర్తలు తరచుగా గొడవ పడుతూ ఆదివారం ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించడంతో జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న మార్గ మధ్యలో భర్త సంతోష్ చనిపోగా భార్య ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. వివరాలను పరిశీలిస్తే జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం సోమయ్య కుంట తండాకు చెందిన కేతావత్ సంతోష్ అనే రైతు వ్యవసాయం చేసుకుంటూ హార్వెస్టర్ కూడా నడుపుతున్నాడు. వ్యవసాయం అనుకూలించకపోవడం హార్వెస్టర్ అనుకున్నంతగా నడవకపోవడం ఈ క్రమంలో తీవ్రంగా కలత చెందిన సంతోష్ కుటుంబంలో భార్యాభర్తల మధ్య డబ్బులు విషయంలో గొడవలు జరుగుతుండేవని బంధువులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం సంతోష్, సరోజ ఇద్దరు కలిసి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఇరుగు పొరుగు వారు ఆసుపత్రికి తరలిస్తుండగా సంతోష్ మార్గమధ్యంలో మరణించగా, భార్య సరోజ పరిస్థితి విషమంగా ఉన్నట్టు గ్రామ-స్తులు పేర్కొన్నారు. రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# అహెూబిలం ప్రహ్లాద వరదలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న మార్కెట్ ప్రసాద్



శ్రీశైలం ,జూలై 6 ( రోమింగ్ న్యూస్ ) అహెూబిలం ప్రహ్లాద వరదలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని ఆదివారం మార్కెట్ ప్రసాద్ దర్శించుకున్నారు. దిగువ అహెూబిలంలో మఠం 46 వ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి వారి ఆధ్వర్యంలో జరు గుతున్న జీర్ణోద్ధరణ అష్టదిగ్బంధన మహాసంప్రోక్షణ చివరి రోజు కార్యక్రమంలో మార్కెట్ ప్రసాద్ పాల్గొన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన వేలాది మంది భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. అన్నదానానికి కావలసిన కూరగాయల నంద్యాల మార్కెట్ ప్రసాద్ వితరణ చేశారు. మార్కెట్ ప్రసాద్ కు అర్చకులు సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు.

# ఈ నెల 8వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు

## ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి:

,శ్రీశైలం, జులై 06 ( రోమింగ్ న్యూస్) : ఈ నెల 8వ తేదీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందని, స్టాక్ పాయింట్ నుండి లోడింగ్, రవాణా చార్జీలు వినియోగదారుడే భరించాల్సి ఉంటుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఇసుక విధానం అమలుపై అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గనుల శాఖ ఏడి రామచంద్ర, నంద్యాల ఆర్డిఓ మల్లికార్జున రెడ్డి, డిటిసి శివారెడ్డి, కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే సోమవారం నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తోందని, ఈ మేరకు నిల్వ ఉన్న స్టాక్ పాయింట్ ల నుండి లోడింగ్, రవాణా చార్జీలు వినియోగదారుడే భరించాల్సి ఉంటుందన్నారు. నంద్యాల జిల్లాలో ప్రతిరోజు 5000 మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, ఇసుక నిల్వలు, స్టాక్ పాయింట్ లు జిల్లాలో లేని కారణంగా సమీప జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలోని స్టాక్ పాయింట్ ల నుండి రవాణా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని గుడి కంబాలి స్టాక్ పాయింట్, కడప జిల్లా కొండాపురం మండలంలోని కే. వెంకటాపురం పి అనంతపురం, సిద్ధవటం మండలంలోని జ్యోతి, వివిఎన్ పల్లి మండలంలోని ఎర్రబల్లి స్టాక్ పాయింట్ ల నుండి ఉచిత ఇసుకను వినియోగదారులు రవాణా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉచిత ఇసుక నిల్వల స్టాక్ పాయింట్లపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.స్టాక్ పాయింట్లు వద్ద వినియోగదారుడు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్లతో వెళ్లి ఇసుక త్రవ్వటానికి, లోడింగ్ కు ప్రతి మెట్రిక్ టన్నుకు రు. 335/- ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి వినియోగదారునికి 20 మెట్రిక్ టన్నుల వరకు ఇసుక తీసుకోవచ్చున్నారు. డిజిఎం పోర్టల్ లో లాగిన్ అయితే స్టాక్ పాయింట్ లలో ఉన్న ఇసుక నిలువలు వినియోగదారులకు కనిపిస్తాయన్నారు. ఇసుక తరలించే వాహనాలకు మాన్యువల్ పర్మిట్ లను తనిఖీ చేయాలని పోలీసు అధికారులను సూచించారు. జిల్లా నుండి అక్రమంగా తరలించే మట్టి, ఇసుక రవాణాలపై పోలీసు, రెవెన్యూ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లపై తనిఖీలు నిర్వహించాలని ఆర్డిఓను ఆదేశించారు. స్టాక్ పాయింట్ దగ్గర డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించి ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. జిల్లాలోని వినియోగదారులకు ఇసుక లభ్యతపై ఎలాంటి సమస్యలు లేకుండా మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రూ.20 కోట్లు ఖర్చు చేశా..!

## మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు



సంగారెడ్డి: గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి సీనియర్లు గెలిచినా, సంగారెడ్డిలో మాత్రం షాకింగ్ ఫలితం వచ్చింది. రెబల్ అండ్ ఫైర్ బ్రాండ్ అయిన జగ్గారెడ్డి ఓటమితో కుంగిపోలేదు, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినా, ఎమ్మెల్యేగా ఓడిపోయినందుకు చాలా ప్రశాంతంగా ఉన్నానని చెప్పి భిన్నమైన కామెంట్లు చేశారు.

**జగ్గారెడ్డి రూటే సపరేట్**

తన కూతురికి పెళ్లి చెయ్యాల్సి ఉందని, మరోవైపు కొడుకు బిజినెస్ పెడుతా డబ్బులు కావాలని అడుగుతున్నాడని చెప్పారు. అయితే తన జీవితం మొత్తం అప్పులు తీర్చడానికే సరిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డిలో బోనాలు, దసరా ఉత్సవాల కోసం ఈ 20 ఏళ్లలో దాదాపు 20 కోట్ల రూపాయలు ఖర్చు చేశానన్నారు జగ్గారెడ్డి. సంగారెడ్డి ప్రజల కోసం తాను అందుబాటులో ఉంటానన్నారు. రెండు నెలల తర్వాత ప్రతి సోమవారం సంగారెడ్డిలోని రాంనగర్ లో జగ్గారెడ్డి తన ఇంటి వద్ద అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తా అన్నారు. కార్యకర్తలు ఎవరు గాంధీ భవన్ కి రావొద్దు అని, మీరు వచ్చినా తాను కలవలేను, మాట్లాడలేను అని స్పష్టం చేశారు.

మొన్నటి ఎన్నికల్లో ఓడిపోవడంతో తాను రిలాక్స్ అవుతున్నానని, ఆ మాటలు మనస్ఫూర్తిగా చెబుతున్నా అన్నారు. ఎన్నికల్లో ఓడినా ప్రశాంతంగా ఉన్నానని చెప్పడంతో ఆయన అనుచరులు, స్థానిక కాంగ్రెస్ నేతలు జగ్గారెడ్డి తీరుతో ఆశ్చర్యపోతున్నారు. అయితే సంగారెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా తాను ఎమ్మెల్యేగా ఓడిపోయనని ఫీల్ కావొద్దని జగ్గారెడ్డి చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉంది కనుక నియోజకవర్గ అభివృద్ధి కోసం పనులు చేసుకుందాం అన్నారు. సంగారెడ్డి ప్రజల కోసం మనం జవాబుదారీగా ఉండాలని స్థానిక పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు తన విజయంపై ఎంత ధీమా వ్యక్తం చేశారో, ఓటమి అనంతరం సైతం జగ్గారెడ్డి తీరులో ఏ మార్పు లేదు.

# జనగామ టిడిపిలో ఉత్సాహం

## చంద్రబాబు సభకు బయలుదేరిన నాయకులు



జనగామ, జూలై 7: (రోమింగ్ న్యూస్) : అఖండ మెజారిటీతో గెలిచి నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు హైదరాబాద్లో ఘన స్వాగతం పలకడానికి జనగామ నుండి టిడిపి శ్రేణులు ఆదివారం హైదరాబాద్ బయలుదేరాయి. తెలంగాణలో మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేస్తూ జనగామ జిల్లా కేంద్రంలోని టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ కు బయలుదేరారు .జనగామ కు చెందిన సీనియర్ టిడిపి నాయకులు చీకట్ల నవీన్, చోటేమియా, ఖలీముద్దీన్, సిరాజ్, ఎగ్బాల్, శ్రీనివాస్, రాములు, పాండు, బైరి బాబు తదితరులు అనేకమంది వాహనాలలో పార్టీ జెండాలు చేతబట్టి ఆదివారం హైదరాబాద్కు చేరుకొని చంద్రబాబుకు పలికిన స్వాగత కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్ లో చంద్రబాబు నాయుడు జిల్లాల వారిగా నాయకులతో మాట్లాడుతూ తెలంగాణలో అంకితభావంతో పనిచేసే టిడిపి నాయకులకు ప్రజా సేవ చేయడానికి మంచి అవకాశాలు కల్పిస్తామని నాయకులు కార్యకర్తలు అందరితో కలిసిమెలిసి పనిచేయాలని గెలుపునిస్తూ మాట్లాడడంతో కార్యకర్తలు భరోసాని వ్యక్తం చేశారు . జిల్లా నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో పార్టీని తిరిగి పూర్వ వైభవానికి తీసుకురావడంలో నాయకులంతా కలిసికట్టుగా కృషి చేస్తామని పార్టీ పటిష్టతకై అందర్నీ కలుపుకొని ముందుకు వెళ్తామని వారు పేర్కొన్నారు. అపార అనుభవం గల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి వల్లనే హైదరాబాద్ ఎంతగానో అభివృద్ధి చెందిందని ఇప్పుడు బాబుతో పాటు నారా లోకేష్ ల ఆధ్వర్యంలో టిడిపి పార్టీ పునర్ వైభవాన్ని సాధిస్తుందని తమ నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ సంతోషం పంచుకున్నారు. త్వరలో తెలంగాణలో జిల్లాల వారీగా నూతన కమిటీల ఏర్పాటు జరగబోతుందని గతంలో పనిచేసిన వారితోపాటు నాయకులతోపాటు కొత్తవారు అనేకమంది కార్యకర్తలు పార్టీలో చేరి చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. జనగామ జిల్లాలో కార్యకర్తలు ఐకమత్యంగా కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అని వారు పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 8
జూలై 2024





# భారత్ బోణీ




## అభిషేక్ సుడిగాలి శతకం
## రాణించిన రుతురాజ్, అవేశ్
## ఛేదనలో తేలిపోయిన జింబాబ్వే
## రెండో టీ20లో టీమ్ఇండియా ఘన విజయం

**జింబాబ్వే పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. తొలి టీ20లో తమకు ఊహించని షాకిచ్చిన ఆతిథ్య జట్టుపై 24 గంటలు గడవకముందే కసిగా ప్రతీకారం తీర్చుకుంది. తొలి మ్యాచ్‌లో డకౌట్ అయినా క్రీజులో నిలబడితే తానెంత ప్రమాదకర ఆటగాడో అభిషేక్ శర్మ రెండో టీ20తో చెప్పకనే చెప్పాడు.**
**హరారేలో అభిషేక్ తుఫాను తర్వాత రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ విధ్వంసకర ఆటతీరుతో భారత్ రికార్డు స్కోరు చేసింది. అనంతరం భారీ ఛేదనలో మన పేసర్లు ముకేశ్, అవేశ్ ధాటికి జింబాబ్వే బ్యాటింగ్ ఆర్డర్ అతలాకుతలమైంది.**




హరారే: సీనియర్ల గైర్హాజరీలో జింబాబ్వే పర్యటనకు వెళ్లిన యువ భారత్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో తమను ఓడించిన ఆతిథ్య జట్టుపై అన్ని విభాగాల్లోనూ సంపూర్ణ ఆధిపత్యం చెలాయించి వంద పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడుతూ అదిరిపోయే ప్రదర్శనలతో జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (47 బంతుల్లో 100, 7 ఫోర్లు, 8 సిక్సర్లు) అంతర్జాతీయ కెరీర్‌లో ఆడిన రెండో మ్యాచ్‌లోనే సుడిగాలి శతకం బాదాడు. అతడికి తోడుగా రుతురాజ్ గైక్వాడ్ (47 బంతుల్లో 77 నాటౌట్, 11 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (22 బంతుల్లో 48 నాటౌట్, 2 ఫోర్లు, 5 సిక్సర్లు) వేగంగా ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 234 పరుగుల రికార్డు స్కోరు చేసింది. భారీ ఛేదనలో జింబాబ్వే 18.4 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌట్ అయింది. వెస్లీ మద్వీర (39 బంతుల్లో 43, 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (3/37), అవేశ్ ఖాన్ (3/15), రవి బిష్ణోయ్ (2/11) రాణించారు. అభిషేక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

**అభిషేక్ తుఫాను:**
టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ రెండో ఓవర్లోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) వికెట్‌ను కోల్పోయింది. కానీ అతడి స్థానంలో వచ్చిన రుతురాజ్‌తో కలిసి అభిషేక్ భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఎదుర్కొన్న తొలి బంతినే డీప్ బ్యాక్‌వర్డ్ స్కేర్ దిశగా భారీ సిక్సర్‌తో ఖాతా తెరిచిన అతడు.. గిల్ నిష్క్రమణ తర్వాత జోరు తగ్గించాడు. కానీ అది తుఫాను ముందు ప్రశాంతతే. 8వ ఓవర్ తర్వాత మొదలైంది అసలు విధ్వంసం. సికిందర్ రజా వేసిన 9వ ఓవర్లో 4, 6తో బాదుడుకు శ్రీకారం చుట్టిన అభిషేక్.. డియోన్ 11వ ఓవర్లో ఫోర్, సిక్సర్‌తో 33 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. ఆ తర్వాత వరుసగా 4, 6, 4 సాధించి ఆ ఓవర్లో 28 పరుగులు పిండుకున్నాడు. రజా 13వ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్‌తో 82 పరుగుల వద్దకు చేరుకున్నాక మసకడ్జ వేసిన మరుసటి ఓవర్లోనే హ్యాట్రిక్ సిక్సర్లతో 46 బంతుల్లోనే అంతర్జాతీయ కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తిచేశాడు. రెండో ఫిఫ్టీకి అతడు తీసుకున్న బంతులు 13 మాత్రమే. సెంచరీ అయ్యాక మరుసటి బంతికే పెవిలియన్ చేరడంతో 137 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత రుతురాజ్‌కు రింకూ జతకలవడంతో భారత స్కోరు వాయువేగాన్ని తలపించింది. 38 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న రుతురాజ్.. చటారా వేసిన 18వ ఓవర్లో ఓ సిక్సర్,మూడు బౌండరీలు బాదా డు. ఆఖరి ఓవర్లో రింకూ 2 భారీ సిక్సర్లు కొట్టాడు.

**ముకేశ్, అవేశ్ ధాటికి విలవిల**
కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు క్రీజులో దిగిన జింబాబ్వే ఇన్నింగ్స్ మూడో బంతికే ఓపెనర్ కైయా (4) వికెట్ కోల్పోయింది. 3 సిక్సర్లు బాదిన బెన్నెట్ కూడా ముకేశ్ మూడో ఓవర్లో ఆఖరి బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 4వ ఓవర్లో బంతినందుకున్న అవేశ్ 4బంతుల వ్యవధిలో మైయర్స్, రజాను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోనీయకుండా చేశాడు. ఈ క్రమంలో జొనాథన్ (10) అండంతో వెస్లీ కొద్దిసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. కానీ బిష్ణోయ్ అతడిని క్లీన్ బౌల్డ్ చేశాడు. లోయరార్డర్ బ్యాటర్ లూక్ జొంగ్వె (33) కాస్త ప్రతిఘటించడంతో జిం బాబ్వే ఆ మాత్రం స్కోరైనా చేయగలిగిం ది. ఇరుజట్ల మధ్య మూడో టీ20 బుధవారం ఇదే వేదికపై జరగనుంది.


భారత్ తరఫున టీ20లలో ఆడిన రెండో మ్యాచ్‌కే శతకం చేసిన మొదటి బ్యాటర్ అభిషేక్. దీపక్ హుడా (3), కెఎల్ రాహుల్ (4) తదుపరి స్థానాల్లో ఉన్నారు. బంతులపరంగా అభిషేక్‌ది నాలుగో వేగవంతమైన సెంచరీ. రోహిత్ (35), సూర్య (45), కెఎల్ రాహుల్ (46) ముందున్నారు.

ఈ ఫార్మాట్‌లో జింబాబ్వేను వంద పరుగుల తేడాతో ఓడించిన రెండో జట్టు భారత్. తొలి స్థానం ఆసీస్‌ది.

సంక్షిప్త స్కోర్లు
భారత్: 20 ఓవర్లలో 234/2 (అభిషేక్ 100, రుతురాజ్ 77 నాటౌట్, ముజర్బని 1/30, మసకడ్జ 1/29)
జింబాబ్వే: 18.4 ఓవర్లలో 134 ఆలౌట్ (వెస్లీ 23, జొంగ్వె 33, అవేశ్ 3/15, ముకేశ్ 3/37)

# రెండో టీ20 రద్దు

## వర్షం అంతరాయంతో సాగని ఆట
## భారత ఆశలపై నీళ్లు




చెన్నై: దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్టుతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో రెండో మ్యాచ్ నెగ్గి పుంజుకోవాలని భావించిన భారత ఆశలపై వం-ణుడు నీళ్లు చల్లాడు. చెన్నైలో కురిసిన వర్షం కారణంగా మ్యాచ్ అర్ధాంతరంగా రద్దైంది. సఫారీ ఇన్నింగ్స్ ముగిశాక మొదలైన వాన ఎంతకూ తెరిపినివ్వకపోవడంతో అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. బ్రిట్స్ (52) మరోసారి అర్ధ సెంచరీతో మెరవగా అన్నెకి బోష్ (40) రాణించింది. గత మ్యాచ్‌లో మాదిరిగానే సఫారీ బ్యాటర్లను కట్టడి చేయడంలో టీమ్ఇండియా బౌలర్లు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిశాక మొదలైన వాన ఆటను సాగనివ్వకపోవడంతో మ్యాచ్ రద్దైంది. ఇరుజట్ల మధ్య కీలకమైన మూడో మ్యాచ్ మంగళవారం ఇదే వేదికపై జరుగుతుంది.

**అవినాష్ జాతీయ రికార్డు**
పారిస్: పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత స్టీపుల్ చేజ్ రన్నర్ అవినాష్ సాబ్లె సరికొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. పారిస్ వేదికగా జరుగుతున్న డైమండ్ లీగ్ పోటీలలో అవినాష్.. పురుషుల 3వేల మీటర్ల పరుగు పందెంను 8 నిమిషాల 09.91 సెకన్లలోనే పూర్తి చేశాడు. తద్వారా గతంలో తానే నెలకొల్పిన 8 నిమిషాల 11.20 సెకన్ల రికార్డును బద్దలుకొట్టాడు. ఈ ఈవెంట్‌లో సాబ్లె ఆరో స్థానంలో నిలిచాడు.


ప్రతి అక్షరం - ప్రజల కోసం

రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

Roaming News





# రాయ్ లక్ష్మి రంజు రంజు లుక్!

రాయ్ లక్ష్మి టాలీవుడ్ కి దూరమై ఐదేళ్లు అవుతుంది. కంబ్యాక్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసింది గానీ పనవ్వలేదు. టాలీవుడ్ అనే కాదు..కోలీవుడ్..శాండిల్ వుడ్..మాలీవుడ్, బాలీవుడ్ ఇలా అన్ని భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. కానీ ఏ భాషలోనూ నిలదొక్కుకోలేదు. స్థిరమైన అవకాశాలు లేకపోవడంతో ఇలా అన్ని పరిశ్రమలో గుమ్మం తొక్కాల్సి వచ్చింది. ఈ ఐదేళ్ల కాలంలో బిజీగా ఉంది ఎప్పుడుంటే? 2019 లోనే.

ఆ ఏడాదే అమ్మడు నటించిన ఐదారు సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఆ తర్వాత ఏడాదికి ఒకటి రెండు చొప్పున చేసింది. కానీ వాటిలో ఏది చెప్పుకోదగ్గ చిత్రం కాదు. ప్యాడింగ్ ఉన్న సినిమాలు కూడా సరిగ్గా ఆడలేదు. దీంతో ప్రస్తుతం మాలీవుడ్ లోనే ఓ సినిమా చేస్తుంది. కెరీర్ పరంగా రాయ్ లక్ష్మి ప్రయాణం అలా సాగుతుంది. అయితే నెట్టింట మాత్రం అభిమానులకు నిత్యం టచ్ లోనే ఉంటుంది.

హాట్ హాట్ ఫోటోలతో హీటెక్కించడం అమ్మడి ప్రత్యేకత. ఇది రాయ్ లక్ష్మిలో మొదటి నుంచి ఉన్న క్వాలిటీ. సినిమాల సంఖ్య తక్కువగా ఉన్నా? ఇంకా యూత్ లో అటెన్షన్ డ్రా చేస్తుందంటే? కారణం ఆరకమైన ఫాలోయింగ్ అన్నది చెప్పొచ్చు. తాజాగా అమ్మడు స్విమ్మింగ్ పూల్ నుంచి ఓ హాట్ ఫోటో వదిలింది. ఇందులో అమ్మడు రెడ్ అండ్ వైట్ కాంబినేషన్ పీస్ లు ధరించి పూల్ మధ్యలో బుక్ పట్టుకుని సీరియస్ గా చదివేస్తుంది.



# శర్మా సిస్టర్స్ సంథింగ్ స్పెషల్



శర్మా సిస్టర్స్ ఎప్పుడు ఎక్కడ ఉన్నా అక్కడ వెలుగు జిలుగులకు కొదవేమీ ఉండదు. నేహా శర్మ -ఐషా శర్మ ఫ్యాషన్ గోల్స్ ని సెట్ చేయడంలో ఎప్పుడూ విఫలం కారు. శుక్రవారం సాయంత్రం ముంబైలో జరిగిన అనంత్ అంబానీ - రాధిక మర్చంట్‌ల వివాహ సంగీత్ వేడుకకు శర్మా సిస్టర్స్ కొత్త కళను తెచ్చారు. ఎంతో స్టైలిష్ గా ఈవెంట్లోకి దూసుకొచ్చిన బాలీవుడ్ సిస్టర్స్ మరోసారి హెడ్ టర్నర్స్‌గా మారారు. రెడ్ కార్పెట్‌పై కెమెరాలకు పోజులిచ్చిన తోబుట్టువులిద్దరూ వెరీ స్పెషల్ గా కనిపించారు. నేహా నల్లటి బ్రాలెట్, రచ్డ్ స్కర్ట్ %డ% ప్రింటెడ్ ష్రగ్‌తో హెడ్ టర్నర్‌గా మారగా.. ఐషా శర్మ మరోవైపు ఈవెంట్ కోసం పీచు-రంగు సంప్రదాయ లెహంగా కాంబినేషన్ చోళీని ధరించింది. నేహా శర్మ- ఐషా సోషల్ మీడియాలలో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉన్నారు. వారి అందమైన ఫోటో షూట్‌లు.. హాట్ పబ్లిక్ అప్పియరెన్స్‌లతో నిరంతరం ఫ్యాన్స్ ని చిల్ చేస్తున్నారు. జిమ్‌లకు వెళుతూ ఫిట్నెస్ గోల్స్ సెట్ చేయడంలోనే కాదు.. విమానాశ్రయాలలో నిరంతరం కనిపిస్తూ ఎల్లప్పుడూ ఫోటోగ్రాఫర్‌ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సిస్టర్స్ ఫోటోషూట్లు ఆన్‌లైన్‌లో తక్షణమే వైరల్ అవుతున్నాయి.

# ప్యారిస్ ప్యాషన్ వీక్ లో జాన్వీ ధగధగలు!

ఫ్యాషన్ వరల్డ్ లో జాన్వీకపూర్ ఎంపికలు ఎప్పుడూ సంథింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతుంటాయి. రెగ్యులర్ ఔట్ ఫిట్స్ ని పక్కనబెడితే కవర్ పేజీల షూట్లో జాన్వీ మెరిపులు అసాధారణంగా ఉంటాయి. ఫ్యాషన్ డిజైనర్ల ఎంపికల్లో జాన్వీ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇప్పటికే అమ్మడు షోలు ఎన్నో చేసింది. విదేశీ వేదికలపై మెరిసింది తక్కువే గానీ..మెరిపించిన కొన్ని సందర్భాల్లోనైనా డిఫరెంట్ డిజైనర్స్ లో తానో బ్రాండ్ బ్యూటీ గా ప్రూవ్ చేసింది. తాజాగా అమ్మడు 2024 పారిస్ ఫ్యాషన్ వీక్ లో ఓ రేంజ్ లో హైలైట్ అయింది. సొగసరి స్టైలిష్ లుక్ ఆహుతుల్ని మైమరిపించింది. %-%ఆరా%-% బ్రాండ్ హెూల్ గ్రాపిక్ టోన్ డిజైనర్ వేర్ లో పై , కోఆర్డినేటింగ్ ఐరిడెసెంట్ మెర్‌మైడ్ ట్రయిల్-స్కర్ట్‌లో జాన్వీ ధగధగలు మామూలుగా హైలైట్ కాలేదు. స్ట్రాప్ లెస్ బ్లౌజ్ లో మరింత అందంగా కనిపిస్తుంది. దీనికి తగ్గట్టు జాన్వీమ్యాకప్, కేశాలంకారణ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి. అచ్చంగా ఈ డిజైనర్ లో మత్స్య కన్యనే తలపించింది. టాప్ టూ బాటమ్ జాన్వీ ఎంపిక చేసుకున్న డిజైన్ నెక్స్ట్ లెవ్ లో అనొచ్చు. ప్రముఖ డిజైనర్ రాహుల్ మిశ్రాకు మద్దతుగా పారిస్ ప్యాషన్ వీక్ లో ఇలా మెరిసింది. ఈ లుక్ నెట్టింట వైరల్ గా మారింది. ఒక్కక్షణం అంతా స్టన్ అయిపోతున్నారు. ఆమె మన జాన్వీనా? అంటూ సందేహ పడుతున్నారు. జాన్విని అలా చూడటానికి రెండు కళ్లు చాలవంటూ పోస్టులు పెడుతున్నారు. ఇక జాన్వీ కెరీర్ జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్, టాలీవుడ్ అంటూ రెండు భాషల్ని దున్నేస్తుంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన %-%దేవర%-%లో నటిస్తోంది. ఆ సినిమా రిలీజ్ కి ముందే రామ్ చరణ్ 16వ చిత్రంలో కూడా ఛాన్స్ అందుకుంది. బాలీవుడ్ లో సినిమాలతోనూ బిజీగా ఉంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986